పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి : సీపీఐ, సీపీఎం ధర్నాలో వక్తలు డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ఉద్యోగులపై రాష్ట్ర వైసిపి ప్రభుత్వం తక్షణమే వేధింపులు ఆపాలని సిపిఐ, సిపిఎం విశాఖపట్నం జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేసారు. జీవిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దుచేయాలని, పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేసారు. మాట తిప్పను, మడమ తిప్పనన్న జగన్మోహన్‌రెడ్డి నేడు ఆ మాటను నిలబెట్టుకోవాలని కోరారు. సిపిఎస్ రద్దుచేయాలని, బకాయి డిఏలు విడుదల చేయాలని రాష్ట్ర ఉద్యోగులు, ఉపా ధ్యాయులు పెద్దఎత్తున పోరా డుతుంటే ఆ పోరాటాలని అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం హేయమైన చర్యని అన్నారు. ఉద్యోగులు ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా, ఆ కార్య క్రమాన్ని జరగనివ్వకుండా పోలీస్ సహ కారంతో నిర్బంధాలు ప్రయోగించడం సరైనది కాదన్నారు. గత అనేక ప్రభు త్వాలు ఉద్యోగులపై నిర్బంధాలు ప్రయోగించి వేటు వేస్తే ఆ ప్రభుత్వాలను అధికారంలో లేకుండా చేసిన సంఘటనలను గుర్తు చేసారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని అన్నారు. దీనిని బిజెపి, టిడిపి, వైసిపిలు ఒక సరుకుగా మార్చివేసాయన్నారు. పెన్షన్ డబ్బులు తీసుకువెళ్ళి షేర్ మార్కెట్‌లో పెట్టడం వలన ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగు తుందన్నారు. తక్షణమే అధికార దుర్విని యోగాన్ని ఆపి, ఉద్యోగులపై వేధింపులు ఆపి పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యోగుల పోరాటాలకు మద్దతుగా వామపక్ష పార్టీలు ప్రజా ఉద్యమానికి పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో సిపిఐ సిపిఎం జిల్లా నాయకులు ఎస్‌కె రెహమాన్, వి.కృష్ణా రావు, జి రాంబాబు, పి.వెంకట రావు, సి ఎస్ క్షేత్రపాల్, గంగాధర్, జి.జయ, కె.కుమారి, ఎ దేముడమ్మ, వాసు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాల్సిందే : సీపీఐ

విశాలాంధ్ర - అనకాపల్లి బ్యూరో : ఉద్యోగులపై రాజకీయ పెత్తనం ఎక్కువైందని తక్షణమే సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పట్నంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ. సిపిఎస్ రద్దు విషయంలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని అమలు చేయలేకపోయారని ఆరోపించారు. ప్రభుత్వోద్యోగులను వేధించడం, టీచర్స్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసు కుంటామని ముఖ్యమంత్రి చెప్పడం అన్యాయ మన్నారు. సీఎం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులను వేధించడం మానుకోవాలన్నారు. సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని కొన సాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మాకిరెడ్డి. రామానాయుడు, పట్టణ సహాయ కార్యదర్శి కోన. లక్ష్మణ, పార్టీనాయకులు గొర్లె.దేముడు బాబు, ఏఐవైఎఫ్. అధ్యక్ష కార్యదర్శి లు వేమల. కన్నబాబు, వియ్యపు రాజు, ఏఐఎ స్ ఎఫ్ జిల్లా కార్యదర్శి గొల్లి ఫణీంద్ర, సీపీఐ నాయకులు విత్తనాల. పోతురాజు, నరాల శెట్టి. సత్యనారాయణ, కొల్లి. సత్యారావు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు

రక్తదాతలకు అభినందనలు

విశాలాంధ్ర - పాడేరు : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి సీతా రామరాజు జిల్లా శాఖ ప్రెసిడెంట్, కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ అభిషేక్, ఐటీడీఏ పీవో,రెడ్ క్రాస్ చైర్మన్ రోణంకి. గోపాలకృష్ణ, రక్త దానం చేసిన రక్త దాతలను అభినందించి ప్రశంసా పత్రలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్త దానం చేయడం ప్రాణ దానంతో సమానమన్నారు. సేకరించిన రక్తం మన జిల్లా లోని తలసేమియా, చికిల్ సెల్ ఎనే మియా బాధితులకు అందజేస్తామని అన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ రక్తం దానం చేసిన ప్రతిఒక్కరికి కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. గతంలో రక్త దానం చేసిన వారికి నేడు స్పందన లో హెల్త్ డిపార్ట్మెంట్ కి చెందిన ఎస్. సంజీవరాజు, దానియల్ కుమార్,ఎ ఎస్ నాయుడు (విద్యా శాఖ), తఫేదార్ ఎస్. శ్రీను (ఐటిడిఎ)కి ప్రశంసలు అందజేసారని రెడ్ క్రాస్ సెక్రటరీ జి.ఈశ్వరరావు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ కోశాధికారి పి.అప్పా రావు, సభ్యులు, సూర్యారావు, సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి

రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : పోలింగ్ పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లికార్జున పిఓలు, ఎపిఓల కు ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని విధులను విజయ వంతంగా నిర్వహించాలన్నారు. శుక్రవారం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాల అధికారులు, పిఓలు, ఏపీఓల తో నిర్వహించిన రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ అనేది అన్నిటికంటే చాలా ముఖ్యమైన భాద్యత అని అధికారులకు తెలిపారు. ఎన్నికలలో పోలింగ్, బ్యాలట్ బాక్సులు స్ట్రాంగ్ రూంలకు చేర్చుట, లెక్కింపు ముఖ్య భాగాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రతి ఒక్కరు బ్యాలట్ బాక్స్ తెరవటం తప్పక తెలుసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి బ్యాలట్ పేపర్‌లో ఒకటి అంకె తప్పక ఉండాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాల పీవోలు , ఏపీవోలు, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి

విశాలాంధ్ర - మల్కాపురం : విద్యార్థినిలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలనీ, అందుకు అవసరమైన నిధులను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా, ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా, యువజన ఉత్సవాల ద్వారా సమీక రించుకోవాలని సెయింట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సేవా కార్యక్రమాల కు నిధుల సమీకరణ చేసే నిమిత్తం ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించడం జరిగింది. దీనిని ఫాదర్ పుష్ప రాజ్ ప్రార్థన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సుపీరియల్ సిస్టర్ ఎల్సీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినిలు సుమారు 30 స్టాల్స్ ను ఏర్పరచి వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి నిధులను సేకరించారు. పానీ పూరి, మురి మిక్చర్, చికెన్ బిర్యాని, వెజ్ బిర్యానీ, మాక్ టైల్, ఐస్ క్రీమ్స్, వెజ్ రోల్స్, వివిధ రకాల స్వీట్లు,బజ్జీలు తదితర స్టాల్స్ ను, మరియు వివిధ రకాల ఆటలు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల నుండి, కాలేజీల నుండి విద్యార్థినీ విద్యార్థులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

గీతంలో రహదారి భద్రతా ర్యాలీ

విశాలాంధ్ర - మధురవాడ : రహదారి ప్రమాదాలను నివారించ దానికి, యువతలో ట్రాఫిక్ నిబంధ నలపై అవగాహన కలిగించ దానికి జాతీయ భద్రత వారోత్స వాలలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం రహదారి భద్రత ర్యాలీని నిర్వహించారు. గీతం జాతీయ సేవా విభాగం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని గీతం సెక్యూరిటీ డైరక్టర్ బి.వి. రమణ కుమార్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తూ, హెల్మెట్ మరియు సీటు బెల్టు ధరించడం, వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడకాన్ని నివారించడం వంటి భద్రత చర్యల ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునని పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో యువత వాహనాలు నడపడం మానుకోవాలని, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు డాక్టర్ కె.ఎల్.సురేష్‌కుమార్, డాక్టర్ టి.దుర్గారావు, డాక్టర్ ఆర్.గోపీనాద్, డాక్టర్ కె.సురేష్, టి.మాలతి, గీతం సేఫ్టీ విభాగం అధికారి కె.పి.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. గీతం ఎన్‌సిసి కేడెట్‌లు, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాల్గొని రహదారి భద్రతపై బోర్డులను, బ్యానర్‌లను ప్రదర్శించారు.

ఎన్.ఎస్.టి.ఎల్ లొ ముగుసిన భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర - గోపాలపట్నం : డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) నావికా పరిశోధనా ప్రయోగ అయిన నావల్ సైన్స్ టెక్నలాజికల్ లాబొరేటరీ 2023 మార్చి 04 నుండి 10వ తేదీ వరకు “మా లక్ష్యం శూన్య హాని”అనే థీమ్‌తో జాతీయ భద్రతా వారోత్సవాలు-2023 జరిగాయి. ప్రదేశంలో భద్రతపైఅవగాహన కల్పించడంపై దృష్టి సారించాయి. ఈ వారంలో అన్ని పని కేంద్రాలకు భద్రతా పోస్టర్లు మరియు వివిధ భద్రతా సూచనలు పంపిణీ చేశారు. సేఫ్టీ వాక్, సేఫ్టీ పోస్టర్ పోటీ, క్విజ్ పోటీ, ఫైర్ మాక్ డ్రిల్ అగ్నిమాపక శిక్షణపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్.ఎస్.టి.ఎల్ సంచాలకులు డాక్టర్ వై. శ్రీనివాస్ రావు, జి.శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్(విశ్రాంత), ఎన్.టి.పి.సి, కె.టి.పి రుద్రప్ప, సీనియర్ మేనేజర్, ఆర్.ఐ.ఎన్.ఎల్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్) ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.డైరెక్టర్ పీవిఎస్ గణేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకునేబదులు అవి జరగకుండా చేపట్టవలసిన చర్యల ఆవశ్యకతను వివరించారు.

ఎమ్మెల్సీగా మాధవ్‌ను గెలిపించాలని ప్రచారం

విశాలాంధ్ర - నాతవరం : నాతవరం మండల బిజెపి అధ్యక్షులు లాలం వెంకట రమణారావు ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు తమరాన ఎర్రన్నాయుడు సమక్షంలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పివిఎన్.మాధవ్‌ను గెలిపించాలంటూ శుక్రవారం గునుపూడి, పికె.గూడెం, గొలుగొండపేట, మన్యపురట్ల, రాజుపేట అగ్రహారం, లింగంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జి పాకలపాటి రవిరాజ్ మాట్లాడుతూ గత శాసనమండలిలో ఎన్నో క్లిష్టమైన ప్రజాసమస్యలపై ఈ అరాచక అవినీతి ప్రభుతాన్ని నిలదీసి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా మాధవ్ ఎంతో కృషి చేశారన్నారు. అలాగే శాసనమండలిలో అందరికంటే ఎక్కువ సమయం మాట్లాడిన ఏకైక వ్యక్తి మాధవ్ అన్నారు. అలాంటి మాధవ్‌ను మరొకసారి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుల్లిదొర, జిల్లా ఒబిసి కోశాధికారి చుక్కల రాంబాబు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు వేముల సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వామపక్షాల ర్యాలీ

విశాలాంధ్ర - కే.కోటపాడు : ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయమైన సమ స్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక వామపక్ష నాయకులు కే కోటపాడు మూడు రోడ్ల జంక్షన్ నుండి ర్యాలీ చేపట్టారు. జిల్లా నాయకులు వేచలపు కాసుబాబు, గండి నాయన బాబులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని విడనాడి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 16500 కోట్ల డిఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు గొర్లే దేవుడు బాబు, రొంగలి ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ, గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీమ్ అమలు కోసం ఏఐటీయూసీ ధర్నా

విశాలాంధ్ర - విశాఖ : ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని, ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరసన ఉద్యమానికి ఏఐటియుసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ శుక్రవారం ఆశీలుమెట్ట జంక్షన్ వద్ద ఏఐటియుసి నిరసన కార్యక్రమం చేపట్టింది. రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి వామనుమూర్తి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాత పెన్షన్ స్కీమ్ అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా అమలు చేయకుండా ఉద్యోగుల బ్రతుకులతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఉపాధ్యా యులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నాలో రావి కృష్ణ, జె ఎస్ మూర్తి, వెంకటేశ్వరరావు, అశోకు రామారావు, రామచంద్రరావు రామకృష్ణుడు పాల్గొన్నారు.

గాజువాకలో జోరందుకున్న ప్రచారం

విశాలాంధ్ర గాజువాక సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగు తున్నది. పార్టీల ప్రచారం రోజురోజుకు స్పీడ్ అందు కుంటోంది. ఆత్మీయ సమ్మేళనాలు, గ్రూప్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి పార్టీలు. వైసీపీ నాయకులు ఒక అడుగు ముందుకు వేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ కొత్త గాజువాక,రాజీవ్ మార్గ్ లోని సత్తెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట కొబ్బరి కాయలు కొట్టారు.ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి తిప్పల దేవన్ రెడ్డి,65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు, టిడిపి కూడా దూకుడుగా ప్రచారం చేస్తోంది ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవి రావు కు మద్దతుగా గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు రోడ్డు షోలతో తమ ప్రచార వేగం పెంచారు, చిరంజీవి రావు కు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ టిడిపి వలెనే అభివృద్ధి సాధ్యం అని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ కు మద్దతుగా విశాఖ స్టీల్ గుర్తింపు యూనియన్ తన ప్రచారాన్ని ముమ్మరం చేసారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా ఎర్రజెండా!

వైసీపీ ప్రభుత్వం వేధింపులపై సీపీఐ, సీపీఎం నిరసన

విశాలాంధ్ర - పెందుర్తి : ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై చేపట్టిన ఆందోళనలకు ఎర్రజెండా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అంతేగాక ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ, సీపీఎం పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. శుక్రవారం పెందుర్తి రైతు బజార్ వద్ద వామపక్ష పార్టీల నాయకులు ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సంధర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కమిటీ నాయకులు బి.రమణిలు మాట్లాడుతూ వైసీపీ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యోగస్తులకు వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని, సకాలంలో జీతాలు చెల్లిస్తామని తదితర హామీలు గుప్పించి ఇపుడు మోసం చేసిందని విమర్శించారు. వైసీపీ క్రింది స్థాయి కార్యకర్త నుంచి మినిస్టర్, ముఖ్యమంత్రి వరకు అవినీతి పనులకు సహకరించని ప్రభుత్వ ఉద్యోగస్తులను వేదింపులకు గురిచేయటం దారుణమని మండిపడ్డారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగస్తులకు సకాలంలో జీత, భత్యాలు ఇవ్వకపోవటం వలన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఓపీఎస్ అమలు చేయాలనీ, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, లేని యెడల అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగస్తులతో కలిసి మరిన్ని ఉద్యమాలకు వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా నాయకులు జగన్, వై.రాంబాబు వామపక్ష పార్టీల శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్పందన ఆర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి : కలెక్టర్ సుమిత్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో - ఏఎస్ఆర్ జిల్లా : స్పందనలు వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కారం కృషి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ సుమత్ కుమార్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలక్రిష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్ లతో కలిసి స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు మండలాల్లో పర్యటించి స్పందన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి అన్నారు. అది లేకుండా అధికారులతో జీతాలు డ్రా చేస్తే వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

45 అర్జీలు సేకరణ : స్పందనలో పలు సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి 45 ఆర్జీలు తీసుకున్నారు. వీరిలో పలువురు పలు తమ గ్రామాలకు మంచినీటి సౌకర్యం కలిగించాలని, రహదారి సౌకర్యం, కల్పించాలని ఇతరత్రా సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన కలెక్టర్ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సీతాంరాజును గెలిపించండి

విశాలాంధ్ర - హుకుంపేట : ఉత్తరాంధ్రా పట్ట భద్రులు సీతంరాజు సుధాకర్ నీ గెలిపించాలని వైఎస్ఆర్ సిపి పార్టీ రాష్ట్రా యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినాయ్ కోరారు. శుక్రవారం మండలంలోని తడిగిరి, తీగలవలస పంచాయితీలో గల అల్లంపుట్టు కామయ్యపేట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో సందర్శించి, ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్ఆర్ సిపి పార్టీ బలపరచిన సీతాంరాజు సుధకార్ నీ తమ అమూల్యమైన ఓటు వేసి గెలి పించాలని కోరారు. పాతకోట పంచాయితీ సోడా, చింతలవీధి, పనసపుటు, మర్రిపా లేం, దిగరూడి, మంగళమామిడి హుకుంపేట పంచాయతీలో స్థానిక సర్పంచ్ సమిడి వెంకట పూర్ణిమ స్థానిక నాయకులతో కలిసి గ్రామల్లో సందర్శించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, ఎంపిటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు సర్పంచ్లు బేసు చిన్నయ్య పార్టీ మండల కో కన్వీనర్ కోటిబాలు, నాయకులు బాలన్న, బో జుబాబు, సచివాలయాల కన్వీనర్లు అనిల్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - అనంతగిరి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మండలంలో విస్తృతంగా కొనసాగుతుంది. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి ఆధ్వర్యంలో మండల కమిటీ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గుమ్మకోట పంచాయతీ గుజ్జలి, గురుకుల పాఠశాల, గుమ్మకోట భీమవరం, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆమె పార్టీ సీనియర్ నాయకులు శెట్టి గంగాధర స్వామి, సర్పంచ్ పాగి అప్పారావు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్రాసూర్యనారాయణ సీనియర్ నాయకులు తిరుపతిరావుతదితరులు కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్సిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఈశ్వరరావు కృష్ణ పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేయండి : మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి

విశాలాంధ్ర - యస్. రాయవరం : ఇళ్లు నిర్మాణం ప్రారంభం చేసి త్వరగా పూర్తి చేయాలని డిఆర్ డిఎ పిడి మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంను పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మాణం చేసుకునే వారు డ్వాక్రా గ్రూపులో ఉంటే అదనంగా 35 వేల రూపాయలు అప్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే సమయంలో ఒక ఇల్లు నిర్మాణం స్థలంలో విద్యుత్ వైర్లు ఉండడంతో నిర్మాణం జరగలేదని లబ్ధిదారులు తెలిపారు. దీంతో ప్రత్యేక అధికారి విద్యుత్ అధికారులను పిలిచి తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్రమూర్తి, మండల పరిషత్ ఎఇ దుర్గశంకర్, ఆర్ డబ్ల్యూ ఎస్ జెఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఇరిగేషన్ ఎఇ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కోరెడ్ల రమాప్రభని గెలిపించాలి

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభని గెలిపించాలని కోరుతూ జీప్సా ఆధ్వర్యంలో లంకెలపాలెం, అగనంపూడి. కూర్మన్న పాలెం ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. జీప్సా మాజీ అధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్.వి కె. పరుశురామ్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి సమస్యలను మండలి లో ప్రస్తావించడంతోపాటు వాటి పరిష్కారం సూచించగలిగే సత్తా ఒక పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలను రికగ్నైజేషన్ మూడు సంవత్సరాల నుండి పది సంవత్సరాలు వరకు పెంచేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు ఆస్తి పన్ను ,చెత్త పన్ను , యూజర్, ప్లే గ్రౌండ్, ఫైర్ ఎన్ఓసిలను మినహాయింపుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. డాక్టర్ కోనేడ్ల రమాప్రభ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు, జీప్సా నాయకులు రంగనాథ్ వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ అధిక సంఖ్యలో టీచర్స్ , నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్ర హత్య కేసును సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని పీఎల్‌పురం గ్రామానికి చెందిన వడ్లమూరి నాగేంద్ర హత్య కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ నిర్వ హించాలని సుప్రీంకోర్టు న్యాయ వాది, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. దళిత బహుజన పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కృష్ణస్వరూప్ మాట్లాడుతూ నాగేంద్ర హత్య కేసులో ప్రధాన నిందితులను రాజకీయ వత్తిళ్లకు లోబడి పోలీసులు వదిలేశారని విమర్శించారు. కొండను తవ్వి ఎలకను పట్టినట్లుగా డీఎస్పీ, సీఐలుగా ఉన్న 5టీములు 9రోజులు కష్టపడి కేసును నీరుకార్చారని విమర్శించారు. పోలీసులు అరెస్టు చేసిన వారితోపాటు, బాధిత కుటుంబ సభ్యులు అనుమానిస్తున్న వారికి నార్కో అనాలసిస్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసులో అధికార, ప్రతిపక్ష నాయకులు కలిసి అసలైన హంతకులను తప్పించారని విమర్శించారు. కేసులో ఎస్సీ, ఎస్టీ సెక్షన్ నమోదు కాలేదన్నారు. పథకం ప్రకారం హత్య చేస్తే 120బి సెక్షన్ ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా, 3 ఎకరాల వ్యవసాయ భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, కాకినాడ జిల్లా అధ్యక్షులు రజాల నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జెక్కుల సూరిబాబు, చిరుకూరి అర్జున్‌రావు, తాటిపర్తి అప్పారావు, ఇలపు నాగబాబు, మార్తి సింహాచలం, గంటేటి చిట్టిబాబు, గారా జయబాబు, పెదపాటి నూకరాజు, బోడపాటి సురేష్, బోడపాటి లక్ష్మి, ఆలవు అఖండ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపించండి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమప్రభకు మొదటి ప్రాధా న్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించి ఎమ్మెల్సీ ఎన్నికలపై కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు కార్మిక ,కర్షకుల, గిరిజన సమ స్యలపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతరం ప్రశ్నిస్తున్నారన్నారు. ఈ కార్య క్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్సీ పోతురాజు గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, మండల నాయకుడు టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో దాతలకు విలువేది...?

విశాలాంధ్ర - సింహచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి ప్రియసతీ అయిన ఆండాళ్ అమ్మవారికి మళ్ళ గౌరీ శంకర్ దంపతులు 42.730 గ్రాముల బంగారు హారాన్ని విరాళంగాను ఆలయ ఏ.ఈ.ఓ ఆనంద్‌కుమార్, సూపరింటెంట్ జి.అప్పలనాయుడుకు అందజేశారు. అలయ మర్యాదల ప్రకారం దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అధికారులు అందజేశారు. అంతా బాగానే ఉంది కాని సింహాచలం దేవస్థానంలో దాతలకు సరైనా మర్యాదలు దక్కటం లేదని భక్తుల వాదన. ఇటీవల కాలంలో పలువురు దాతలు వెండి , బంగారు వస్తు రూపేణా విరాళం ఇస్తామంటే ఎందుకండి హుండిలో వేసేయండి అంటూ కొంత మంది సిబ్బంది దాతలతో అన్నట్లు సమాచారం. పైన తెలిపిన దాత బంగారు హారం విరాళం ఇవ్వటాని సుమారుగా పదిహేను రోజులు పట్టినట్లు, ఓ ఉన్నతాధికారి ద్వారా అధికారికంగా నిన్న విరాళం ఇచ్చినట్లు తెలిసింది. ఇందుకు కొన్ని ఉదాహరణలు ఆలయంలో భద్రత నిమిత్తం 2018లో కొంత మొత్తం దాతల సహకారం, దేవస్థానం అధికారులు లక్షల రూపాయిలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన 6 డోర్ మెటల్ డిటెక్టర్లు , హ్యాండ్ మెటల్ డిటేక్టర్లు 4 కొనుగోలు చేశారు. అవి ఎమయ్యాయో , ఎక్కడ దున్నాయో ఏవరికి తెలియదు. 2020లో పాత తలుపులకు ఇత్తడి రేకు తాపడం చేసి ఉండేది. నీలాద్రి గుమ్మం ద్వారాలకు స్వర్ణ రేకులను చేయిస్తామని దాత ముందుకు వచ్చారు. ఆయనకు సరైన గౌరవం దక్కక ఆపని కాస్త అటకెక్కింది. ఏసిలు, ఫ్రిడ్జ్ లు, వాల్ ఫ్యాన్లు, ఇత్తడి గుర్రం (ఎక్కడుందో తెలియదు), వరహరూపం(ఇత్తడి) విగ్రహం, పలు బంగారు, వెండి, ఇత్తడి, వాహనాలు ఇలా అనేక విరాళాలు ఇచ్చిన దాతలు గగ్గోలు పెడుతున్నారని భక్తులు, స్థానికులు అంటు న్నారు. ఎంతసేపు ఆలయ ఉన్నతాధికారులకు, దర్శనాలకు వచ్చే వారికి పాలిష్ సేవ చేయటం తప్పా తీసుకుంటున్న జీతానికి, స్వామివారికి నిజమైన సేవ ఎంతవరకు చేస్తున్నాం, అని ఏనాడైనా ఒక్క క్షణం వారి వారి మనస్సాక్షిగా ప్రశ్నించు కున్నారా? అని కొందరు ఉద్యోగులు అంటున్నారు. పూర్వం ఆలయ అభివృద్ధికి ఎంతో మంది దాతలు స్థిర, చర, ధన, వస్తు రూపేణా విరాళాలు ఇచ్చేవారు, ఇస్తున్నారు కూడాను. అటువంటి వారి పట్ల అధికారులు, సిబ్బంది చిన్న చూపు చూడటం ఎంతవరకు సమంజసం అని భక్తుల వాదన. ఎంతసేపు వి.ఐ.పి, వి.వి.ఐ.పిల సేవ, లేదంటే తమకు ఏమైనా ఫలానా దానివాలని లాభం కలసి వస్తుందా లేదా అనే ఆలోచనతో విధులు ఆలయం లో నిర్వహిస్తారు తప్పా ? దేవునికి, ఆలయానికి పనికి వచ్చే పనులు చేయరని భక్తులు అంటున్నారు. అదేవిధంగా ఆలయానికి దాతలు డబ్బు లేదా వస్తువులు ఇంచ్చిన రోజు మాత్రమే వారికి సర్వ సేవలు చేస్తారని, తరువాత ఎప్పుడైనా స్వామిర్శనానికి వస్తే పట్టించుకునే వారు ఎవరు లేరని పై పెచ్చు డోనార్ ఐతే ఎవరికి ఎక్కువ అనే సందర్భాలు కో కొల్లలు అని భక్తులు ఆలయ అధికారులపై మంది పడుతున్నారు. అందుచేత ఇటివల కాలంలో డోనార్స్ కరువైనారు లేకుంటే పల్లెల్లో లేదా పట్టణాల్లో నూత నంగా నిర్మించిన ఎన్నో దేవాలయాలు దేదివ్య మానంగా భక్తులకు హాయ్ గొలిపే విదంగా తయారు చేయించారు ఆయా ప్రదేశాల ఆలయ అధికారులు. ఎంతో చరిత్ర కలిగిన వరాహలక్ష్మీ నారసింహ స్వామి వారి ఆలయాని ఏమిటి పరిస్థితి? చాలా భాదాకరంగా ఉందంటూ భక్తులు తమ మనస్సులోని మాట తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులపై ప్రభుత్వ వేధింపులు ఆపాలి



విశాలాంధ్ర - అరకులోయ : అరకులోయ మండల కేంద్రంలో గల 4 రోడ్ల జంక్షన్ వద్ద శుక్రవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిలో సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యం కూని చేసే విధంగా జీవో నెంబర్ ఒకటి తీసుకువచ్చి బహిరంగ ప్రదేశాల్లో ఆందోళనలు నిరసనలు చేయరాదని ఆంక్షలు పెట్టి ప్రజల గొంతు నొక్కే కార్యక్రమం కొన సాగిస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో జీవో నెంబర్ 3 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగంగా సుప్రీంకోర్టు రద్దు చేసిందని ఆయన తెలిపారు. జీవో నెంబర్ 3 పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి స్పందన ఇవ్వడం లేదనీ గిరిజన ప్రాంతంలో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదన్నారు. రూలప్ రిజర్వేషన్ అమలు చేస్తూ గిరిజన ప్రాంతంలో గిరిజనులకు ఉపాధి లేకుండా అడ్డు కుంటున్నారనీ ఆయన వాపోయారు. డీఎస్సీ పేరుతో యువతకు కోచింగ్ సెంటర్లో ఫీజులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.గిరిజన ప్రాంతంలో అల్లూరి జిల్లా పరిధిలో 87 పాఠశాలలు విలీనం పేరుతో మూత బడుతుందనీ అలాగే సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయులు ఆందోళన చేస్తూ ఉంటే ప్రభుత్వం కనీసం స్పందించకుండా వేధింపులకు గురి చేస్తూ మానసిక ఒత్తిడి రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీగా సంపూర్ణ మద్దతు ఇస్తూ భవిష్యత్తులో మరింత పోరాటం చేసి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల హక్కులను రక్షించడానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు, సీపీఎం పార్టీ మండల నాయకులు పొద్దు బాలదేవ్, జి.బుజ్జిబాబు, టి.జోషి, పి.నాని బాబు, పి.రామన్న, కె.మగ్గన్న, కూర్మన్న, మురళి వివి.జయ కె.మగ్గన్న, జె.భగత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మిక ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి



విశాలాంధ్ర - కొయ్యూరు : మండలంలోని కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మాతే సువర్ణ (11) అనారోగ్యంతో మృతి చెందింది. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న నాతవరం మండలం సుందరకోట గ్రామానికి చెందిన మాతే సువర్ణ శుక్రవారం ఉదయం పాఠశాలలో అకస్మాత్తుగా నురగలు కక్కుతూ కింద పడిపోయినట్లు తెలిసింది. దీంతో పాఠశాల యాజమాన్యం హుటాహుటిన విద్యార్థినిని సమీప కంతారం పిహెచ్సి కు వైద్య సేవలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. శుక్రవారం సాయంత్రం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సమాచారం. కాగా విద్యార్థిని మృతి పై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రాల పరిధిలో రెండు రోజులు డ్రై డే

విశాలాంధ్ర బ్యూరో - ఏఎస్ఆర్ జిల్లా : జిల్లాలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పరిధిలో రెండు రోజుల పాటు డ్రై డేగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. 13వ తేదీన పోలింగ్ జరగనున్నందున 11వ తేదీ సాయంత్రం 04.00 గంటల నుండి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు సాయంత్రం 04.00 గంటల వరకు పాడేరు డివిజన్ పరిధిలో గల 11 మండలాలలో పోలింగ్ కేంద్రాల పరిధిలో 19 మద్యం రిటైల్ అవుట్ లెట్లు, అరకు మండల పరిధిలో గల హరిత వేలీ రిసార్ట్స్, హరిత హిల్ రిసార్ట్స్, అనంతగిరి మండల%శీ% లో హరిత వేలీ రిసార్ట్స్, టైడా జంగిల్ బెల్స్ లో హరిత రిసార్ట్స్ లో గల టిడి-1 లైసెన్స్ షాపులకు ఈ డ్రై డే వర్తిస్తుందని, 11వ తేదీ సాయంత్రం 04.00 గంటల నుండి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు సాయంత్రం 04.00 గంటల వరకు మద్యం షాపులు మూసివేయాలని కలెక్టర్ ఉత్తర్వులలో ఆదేశాలు జారీ చేసారు.

స్కోడా సింగిల్ వికెట్ ప్రకటన

విశాలాంధ్ర - విశాఖ సిటీ : స్కోడా ఆటో ఇండియా నుంచి స్కోడా సింగిల్ వికెట్ టోర్నమెంట్ యొక్క సీజన్ 20 ప్రకటించింది. దీనితో భారతదేశం అంతటా 59 నగరాలు 32,000కు పైగా యువ క్రికెటర్లను కవర్ చేయాలనే లక్ష్యంతో ఉందని స్కోడా ప్రతినిధి పీటర్ సా ల్క్ వెల్లడించారు. స్కోడా సింగిల్ వికెట్ సీజన్ 2 ఏప్రిల్ 28న ప్రారంభమవుతుందన్నారు. సెంట్రిసిటీ మా కస్టమర్ల పట్ల క్రీడ, పోటీ నైపుణ్యం కాకుండా, మానవస్ఫూర్తిని జరుపుకోవడం కూడా మా హ్యూమన్ టచ్ అప్రోచ్ లో భాగంగా మేము చేసే ప్రతి పనికి కస్టమర్లు కేంద్రంగా ఉన్నారన్నారు. దీంతో యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ప్రామాణికమైన ప్రత్యేకమైన వేదికను అందిస్తుందన్నారు. ముఖ్యంగా స్కోడా సింగిల్ వికెట్ టోర్నమెంట్ ఈ సీజన్లో బాలికల అండర్-16 విభాగాన్ని ప్రవేశ పెట్టిందన్నారు.

విజయాన్ని కాంక్షిస్తూ సత్తెమ్మతల్లికి పూజలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : గాజువాకా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ 65వ వార్డు వైసీపీ కమిటీ ఆధ్వర్యంలో కొత్త గాజువాక, రాజీవ్ మార్గ్‌లోని సత్తెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సక్రమంగా ఓటు వినియోగించు కోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట : ఉత్తతరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు కలిగిన ప్రతి ఒక్కరు సక్రమంగా ఓటు వినియోగించు కోవాలని స్థానిక తహశీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేక రులతో మాట్లాడుతూ హుకుంపేట హైస్కూల్ ఇంగ్లీష్ మీడియం 2 లో పాఠశాల పోలింగ్ కేంద్రం నెంబరు 148 మండల ఓటర్లు ఈనెలా 13 సోమవారం తమ యొక్క ఓటు వినియోగించు కోవాలని ఆమె కోరారు.

సీఎం జగన్‌తోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర - జి.మాడుగుల : కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు అన్న భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వంలోనే లబ్ధి చేకూరిందని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ లికుంభా రవిబాబులి అన్నారు. అందరి పక్షాన్న నిలిచే ప్రభుత్వానికి మనమంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. జి.మాడుగుల మండలం ఏపీ ఆర్ ఎస్ స్కూల్లో పాడేరు శాసనసభ్యులు లిశ్రీమతి కొట్టగుల్లి భాగ్య లక్ష్మిలి గారి ఆధ్వర్యంలో టీచర్లతో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం గిరిజన పక్షాన్న నిలుస్తుందని ప్రతి సమస్యను కూలంకషంగా పరిశీలించి పరిష్కారానికి నిరంతరం ప్రయత్నిస్తుందని చెప్పారు. మంచి చేసే వ్యక్తులు ఆదరిస్తేనే భవిష్యత్తులో మంచి అనేది జరుగుతుందని పేర్కొన్నారు. ఇంతకుముందు ఎన్నడూ జరగని మేలు కేవలం జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలోనే జరగడం శుభ పరిణామమని తెలిపారు. అందుకే పార్టీలు, కులాలు, మతాలు అన్నింటికీ అతీతంగా జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర మంతటా ప్రశంసలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్బ నర్సింగ రావు, పాడేరు ఎంపీపీ, జి.మాడుగుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సోనారి రత్తకుమారి, రమణమూర్తి, పార్టీ మండల అధ్యక్షులు మత్స్యకొండం నాయుడు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పక్కాగా జరగాలి : కలెక్టర్



విశాలాంధ్ర - చోడవరం : జిల్లాలో భూముల రీ సర్వే పక్కాగా జరగాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠాన్ శెట్టి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చోడవరం మండలం చాకిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే, జగనన్న కాలనీ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే వలన వచ్చే లాభాలను గూర్చి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎటువంటి పొరబాట్లు, వివాదాలకు తావివ్వకుండా ఖచ్చితత్వంతో పని చేయాలన్నారు. రీ సర్వేపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పుడు చేస్తున్న రీ సర్వే గురించి అధికారులు రైతులకు గ్రామస్తులకు వివరంగా చెబుతున్నారా లేదా అని రైతాంగాన్ని ప్రశ్నించారు. రీ సర్వే పై రైతాంగం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం తాహశీల్దారు తిరుమల బాబు, ఎం.పి.డి.ఓ. శ్యాం సుందర్, సర్వేయర్ వేణుగోపాల్, గ్రామ సర్పంచ్, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ విపత్తుల నివారణ సదస్సుకు హాజరైన నగర మేయర్ హరివెంకట కుమారి



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జాతీయ విపత్తుల నివారణ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ యు ఎల్‌బిల తరఫున న్యూఢిల్లీలోని విజ్ఞాన భవనం లో జరిగే సదస్సుకు శుక్రవారం విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హాజరయ్యారు. ఎన్‌పిడిఆర్ ఆర్ సదస్సుకు ముఖ్య అతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఎన్‌పిడిఆర్‌ఆర్‌కు సభ్యురాలిగా విశాఖపట్నం మేయర్ గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. విశాఖపట్నం సముద్ర తీరాన ఉండడం, అనేక రకాల పరిశ్రమలు ఇక్కడ స్థాపించబడి ఉన్నాయని, ప్రకృతి వైపరీత్యాలు విపత్తులు ఎన్నో మనం ఎదుర్కొన్నామని, విపత్తుల సంభవించినప్పుడు వాటిని ముందుగా ఎదుర్కోవడం ఎలా, అలాగే నివారణ చర్యలు రిస్కు తగ్గించడం ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తగ్గించడం వంటివి ఇక్కడ చర్చించేందుకు అవకాశం ఉందన్నారు. విశాఖ నగరం విపత్తులను తట్టుకుంటూ వాతావరణ మార్పులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటూ సుసుస్థిర అభివృద్ధి వైపుకు ముందుకు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సదస్సుకు కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, యూనియన్ హెూం సెక్రటరీ అజయ్ కుమార్ బల్ల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత, విపత్తుల నిర్వహణ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగులకు ఓటు వేసేందుకు వెసులుబాటు

విశాలాంధ్ర - అనకాపల్లి బ్యూరో : ఈనెల 13న పట్టభద్రుల శాసన మండలి నియోజక వర్గ ద్వైవార్షిక, ఎన్నికలు జరుగు తున్నందున అనకాపల్లి జిల్లాలో పని చేస్తున్న వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు లేదా ఇతర సంస్థల అన్ని ప్రైవేట్ మేనేజ్ మెంట్‌లు, అథారిటీలు తమ సంస్థలో పనిచేస్తున్న ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలు కల్పిస్తూ విధులకు ఆలస్యంగా హాజరు, అనుమతులు లేదా షిఫ్ట సర్దుబాట్లు, డ్యూటీ గంటలు తగ్గించడం వంటి వెసులుబాటు కల్పించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఒక ప్రకటనలో కోరారు.

757వ రోజుకు విశాఖ ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి ఆధ్వర్యాన 757వ రోజు రిలే నిరాహారదీక్షలులో ట్రాఫిక్, ఆర్.ఎం,డి డిపార్టుమెంట్‌ల కార్మికులు దీక్ష శిబిరం లో పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, ఎన్ రామారావు, జ.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నాయుడు, మాట్లాడుతూ లాభాలు నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ పరం దిశగా నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన ఈ ఏడాది జనవరి ఫిబ్రవరి నెలలో నికర లాభాలు దిశగా నడిచిందని దాన్ని తట్టుకోలేక బిజెపి పాలకులు సకాలంలో రైల్వే రేకులు రాకుండా గత కొద్ది రోజులుగా అవరోధాలను సృష్టించారని తెలిపారు. ఉన్నతాధికారులు తీరుమార్చు కోకపోతే తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి జరగాలని తద్వారాన్ని నష్టాలు బారిన పడకుండా ఉంటుందని చెప్పారు. వచ్చే పార్లమెంటు సమావేశంలో న్యూఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్లాంట్ ప్రభుత్వం లో కొనసాగి వరకు పోరాటాలు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగల కార్మికలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమా ప్రభ గెలుపు కోరుతూ సీపీఐ ప్రచారం



విశాలాంధ్ర - అనకాపల్లి బ్యూరో : ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల. రమా ప్రభను గెలిపించాలని సీపీఐ, ఏఐటీయూసీ, విద్యార్థి, యువజన సంఘాలు కోరాయి. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి. వెంకటరమణ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం లో కోచింగ్ సెంటర్, బ్యాంక్ లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ. మేధావులకు బదులుగా వ్యాపా రులను, సారా, ఇసుక కాంట్రాక్టర్లు ను చట్ట సభలకు పంపాలన్న జగన్ ప్రభుత్వ విధాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకి రెడ్డి. రాము నాయుడు, ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కోన. లక్ష్మణ, నాయుకులు దేముడు బాబు ఐ ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు వేమల. కన్నబాబు, వియ్యపు. రాజు, ఆర్టీసీ రిటైర్డ్ సంఘం అధ్యక్షులు విత్తనాల. పోతురాజు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఎంపీపీ



విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఎంపీపీ కారం లక్ష్మి సందర్శించారు. సోముల గూడెం గ్రామం లోని బాలికల ఆశ్రమ పాఠశాలను సంద ర్శించి హాస్టల్లో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 308 విద్యార్థులకు గాను, 7. గురు ఉపాధ్యాయులు ఉన్నారని, వారిలో 10.వ తరగతి విద్యార్థులు 94 మంది ఉన్నారని, ఫిజిక్స్, సోషల్ ఇంగ్లీష్, సైన్స్ బోధించేందుకు ఉపాధ్యాయులు లేరని హెచ్ఎం ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, వంకు సత్తిబాబు, వడ్లది రమేష్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

ఎమ్మెల్సీగా రమాప్రభను గెలిపించాలి



విశాలాంధ్ర - జీకే వీధి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అల్లూరి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు దిల్షాన్బాబు, స్థానిక నాయకులు అపురంగి బుజ్జిబాబు, సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ కోరారు. శుక్రవారం జికెవీధి మండలం రింతాడ, ఆర్వీనగర్ గ్రామాల్లో పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేసి గెలిపించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శాసనసభలో మాట్లాడే సత్తా రమాప్రభకు ఉందన్నారు.

ఏపీ ఎంఎస్ఎండిసి చైర్మన్‌గా ఆనంద్

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఏపీ మైక్రో, స్మాల్ అండ్ మీడియం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎంటర్ప్రైజెస్(ఏపీ ఎం ఎస్ ఎం డిసి) చైర్మన్ గా నియమితులైన సందర్భంగా జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కర రావు సాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేస్తూ, అభి నందించారు. ఈ కార్యక్రమంలో 91వ అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ అధ్యక్షులు జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, నీలాపు శ్రీనివాస్ రెడ్డి, కంపర కోటేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరం పంచాయతీలో వైసీపీ ఎమ్మెల్సీ ఓట్లు ప్రచారం



విశాలాంధ్ర - ఆనందపురం : పట్టభద్రుల ఎలక్షన్ ప్రక్రియలో భాగంగా మండలంలో గంభీరం గ్రామ పంచాయతీలో భీమిలి శాసన సభ్యులు ముత్తం శెట్టిశ్రీనివాస్ ఆదేశాలు మేరకు ఉత్తరాంధ్ర వైఎస్ఆర్సిపి బలపర్చిన సీతంరాజు సుధాకర్ గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యవలిసిందిగా పట్టభద్రులుని కలిసి అభ్యర్థించడం జరిగింది . జగన్మోహన్ నవరత్నాలు భాగంగా పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఓటర్లకు తెలియపరిచారు. ప్రచారం లో వైస్ ఎంపీపీ బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ మాజీ ఎంపీటీసీ ఉప్పాడ సూరిబాబు ,టెడ్లపు గోవిందరామిరెడ్డి ,దల్లి పాపారావు ,ప్రసాద్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓయస్‌జి ఫౌండేషన్ 25వ రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - భీమిలి : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ లో ఓ యస్ జి ఫౌండేషన్ 2021-జూలై 25 వా తేదీన ఒక రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి తరచూ బ్లడ్ క్యాంపులు పెడుతూ గర్భిణీ స్త్రీలకు రోడ్డు ప్రమాదాల్లో జరిగిన వారికి గుండె ఆపరేషన్ లకి తలసేమియా చిన్నారికి క్యాన్సర్ పేషంట్లకి క్రమేపి నేటికీ 24 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి నిత్యం రక్తం అవసరమైన వారికి ఈ స్వచ్ఛంద సంస్థ నుంచి అందిస్తున్నారు అదేవిధంగా మెడికల్ కేస్ కని ఆశ్రమాలకు బోజన పంపిణీ కని తరుచూ సేవ మార్గంలో పయనిస్తూ రేపు అనగా 11/3/2023 శనివారం నాడు 25 వా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ ఏడాది వరకు మూడు లక్షల రూపాయలు ఇన్సురెన్స్ ఈ శ్వచంద సంస్థ ద్వారా ఇస్తు ఉచిత వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశారు అని ఓ యస్ జి ఫౌండేషన్ శివ మరియు సభ్యులు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీని ప్రారంభించిన డిఎస్పీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - యలమంచిలి : ఆంధ్రప్రదేశ్ 40వ సబ్ జూనియర్,5వ క్యాడేట్ అంతర్ జిల్లాల టైక్వాండో పోటీలు యలమంచిలి వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో చాంపియన్షిప్ నిర్వాహక కార్యదర్శి నగిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పరవాడ డిఎస్పీ పి.శ్రీనివాసరావు, సిఐ ఎస్ కె గఫూర్, యలమంచిలి ఎమ్‌పిపి బోదెపు గోవింద్, న్యూ ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ జెనరల్ సెక్రటరీ పి.అచ్యుతరెడ్డి,జాతీయ రిఫరీ బి.అర్జునరావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా డిఎస్పీ పి.శ్రీనివాస రావు మాట్లాడుతూ శరీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి ఆత్మరక్షణకు టైక్వాండో క్రీడా ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రీడపై ఇంత ప్రత్యేక శ్రద్ధతో చిన్నపిల్లలు కూడా రాష్ట్రంలో గల నలుమూలల నుంచి రావడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీలకు టైక్వాండో కోచ్‌లు, రిఫరీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బి.నాగేశ్వరరావు, ఎ.గుప్తా, పట్టణ వైసీపీ అధ్యక్షులు బొడ్డపు ఎర్రయ్యదొర, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యలమంచిలి టైక్వాండో సీనియర్, జూనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.జె.డి. ఆకస్మిక తనిఖీలు... ఉపాధ్యాయులు పనితీరుపై ఆగ్రహం



విశాలాంధ్ర - చోడవరం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం (ఆర్.జె.డి.) ప్రాంతీయ ఉప సంచాలకులు ఆర్.జ్యోతి కుమారి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చోడవరం మండలం లోని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలను ఆకస్మికంగా సందర్శించారు. గోవాడ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో అమలు జరుగుతున్న టీచింగ్ ఎట్ రైట్ లెవెల్, అభ్యసన అభివృద్ధి కార్యక్రమం అమలును, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో 8వ తరగతిలో విద్యార్థుల బైజూస్ ట్యాబ్‌ల వినియోగంను విద్యార్థుల వారీగా పరిశీలించి, వినియోగం తక్కువగా ఉండుట గమనించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్యాబ్ ల వినియోగం పట్ల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల నోట్సు లను పరిశీలించి కరెక్షన్స్ సరిగ్గా లేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరుపై మండిపడ్డారు. మధ్యాహ్నం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంను సందర్శించి, కార్యాలయంలో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు , డి.శ్రీను పాల్గొన్నారు.

సింహాద్రిలో ముగిసిన భద్రత వారోత్సవాలు

విశాలాంధ్ర - పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు వివిధ పోటీలను నిర్వహించారు. విజేతలకు సేఫ్టీ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ గ్రూప్ జనరల్ మేనేజర్ (జీజీఎమ్) ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల భద్రతే సంస్థకు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్, సంస్థ ఓ అండ్ జీ.ఎం డి.వి పాత్ర, ప్రాజెక్ట్ జీ.ఎం ఎస్.కె ఝా, హెచ్ఆర్ ఏజీఎం రూమా డి.శర్మ, సీఐఎస్ ఎఫ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు తమ రక్షణకు చట్టాలను వినియోగించుకోవాలి



విశాలాంధ్ర - యలమంచిలి రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ వారం రోజుల పాటు జరిగిన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు ముగింపు వారోత్సవాన్ని యలమంచిలి న్యాయస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఎ. సాయికుమారి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ మహిళలు సంఘంలో ఎదుర్కొంటున్న సమస్యలు వాటిని న్యాయపరంగా ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు.మహిళలు తమ మీద తమకు ఎక్కువ నిగ్రహ శక్తిని పెంపొందించు కోవాలన్నారు. ఎ.జి.పి ద్వారపు రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు ప్రతీ ఒక్కరూ తన కుటుంబ విలువలు కాపాడడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం న్యాయవాది కూనిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పోక్సో భరణం, విడాకులు, గృహహింస, వరకట్న వేధింపులు వంటి మహిళలకు సంబంధించిన అనేక చట్టాల గురించి సవివరంగా వివరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాళ్ల సత్యనారాయణ, న్యాయవాదులు రామ్మోహన్ రావు, కూనిశెట్టి శ్రీనివాస్, కొఠారు. దొర,వెలుగు ఎ.పి.ఎమ్. రాణి,ఐ.సి.డి.ఎస్.సూపర్ వైజర్ బేగం,ప్యానల్ కమిటీ సభ్యులు,కోర్టు సిబ్బంది, వెలుగు,అంగన్వాడీ సిబ్బంది, మహిళా వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరం

విశాలాంధ్ర - జీకేవీధి : జికెవీధి మండలం గదబ, నేరేడుపల్లి, రాళ్లగెడ్డ గ్రామాలలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇతర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో మొత్తం 63 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సీలేరు పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ కె. సౌమ్య, హెల్త్ సూపర్వైజర్ ఎన్.త్రినాథ్, సిహెచ్ఎ వరలక్ష్మీ, ఏఎన్ఎం అరుణకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర - కొయ్యూరు : గిరిజన ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగుతున్న భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థి పివిఎన్ మాధవ్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆలిండియా లేబర్ బోర్డు చైర్మన్ జయప్రకాష్ విజ్ఞప్తి చేశారు. భాజాపా ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్ విజయాన్ని కాంక్షిస్తూ భాజపా గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా కృష్ణారావు ఆధ్వర్యంలో లేబర్ బోర్డు చైర్మన్ జయప్రకాష్ పలువురు నేతలు మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు గురుకుల పాఠశాల కళాశాల తదితర చోట్ల ఆయా ఉద్యోగులు సిబ్బందితో భాజపా నేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే భాజాపాతోనే సాధ్యమన్నారు. ప్రపంచంలోనే భారతదేశానికి అత్యున్నత స్థానం కల్పించిన మోడీ నాయకత్వంలో భారత్ వెలుగొందుతోందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే భాజపా బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంప రాజేంద్రపాలెం అల్లూరి స్మారక ప్రదేశాల అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు మంజూరుకు మాధవ్ విశేష కృషి చేశారని కొనియాడారు. అటువంటి వ్యక్తిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రొయ్యల చెరువులు పరిశీలించిన అధికారులు



విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలోని వాకపాడు రెవెన్యూ పరిధిలోని వెంకటాపురం సమీపంలో ఉన్న రొయ్యల చెరువులను అధికారులు పరిశీలించారు. రొయ్యలు సాగు చేసే వారు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంటారు. అందులో భాగంగా జిల్లా మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులులు వచ్చారు. ఇచ్చిన అనుమతులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి రామ్మోహనరావు, ఈవోపిఆర్డీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఎఈ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ పరస్పర సహకారం

విశాలాంధ్ర - కొయ్యూరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా పనిచేయాలనే ప్రచారం జరుగుతుంది. అల్లూరి జిల్లా ఏజెన్సీలో ముమ్మరంగా శుక్రవారం ఇటు టీడీపీ, అటు వామపక్షలు పీడీఎఫ్ అభ్యర్థి గెలుపుకై విడివిడిగా ఒకే తరహా ప్రచారం చేస్తుండటం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, వ్యాపార,నిరుద్యోగ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. దాదాపు దశాబ్ద కాలం తర్వాత టీడీపీ వామపక్షాలు కలిసి ఎన్నికల్లో పరస్పర సహకారం అందించుకొనేందుకు ముందుకు రావటంతో ప్రయోగత్మకంగా చేసే సయోధ్య పై అన్నీ వర్గాలు భవిష్యత్ ప్రణాళికకు మంచి నిర్ణయం అనే అనుకుంటున్నారు. ప్రధానంగా అల్లూరి (ఉమ్మడి విశాఖ)ఏజెన్సీలో వైసీపీకి కంచుకొటగానే చెప్పాలి.అయితే ఇదే క్రమంలో ఏజెన్సీలో పూర్వం నుంచి పలు దపాలుగా సిపిఐ వామపక్ష పార్టీల నుంచి ఎమ్మెల్యేగా (సిపిఐ)రెండు ధపాలు, టీడీపీ నాలుగు పర్యాయాలు గెలుచుకోగా, ఎంపీ స్థానాలు కూడా సిపిఐ, సీపీఎం లనుండి నాలుగు ధపాలు గెలుచుకున్న పరిస్థితి ఉంది. అధికారంలో ఉన్న వైసీపీ ఏజెన్సీలో సైతం ఆశించిన అభివృద్ధి చేయలేకపోయినట్టు గుర్తిస్తున్న నేపథ్యంలో మరో పక్క పాతమిత్రులైన టీడీపీ, సిపిఐ, సీపీఎం ఇతర అనుబంధ పార్టీలన్నీ ఏకం కావటంతో ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి గెలుపుకు ముమ్మరంగా చాపకిందనీరులా ప్రచారం చేస్తున్నారు

గ్రీన్ అంబాసిడర్స్ పట్ల నిర్లక్ష్యం తగదు : సర్పంచ్ సూర్యకుమార్



విశాలాంధ్ర - రావికమతం : స్వచ్ఛభారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన గ్రీన్ అంబాసిడర్స్ అనగా పారిశుధ్య కార్మికులను, అలాగే చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణ కొరకు గ్రీన్ గార్డులను నియమించి ప్రస్తుతం వారిని గాలికి వదిలేయడం పట్ల మండలంలో కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ గత ఏడాది వరకు ఒక్కొక్క గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డ్ లకు నెలకు 6000 రూపాయలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తూ కొనసాగించింది. అన్నారు. మండలంలో 83 మంది గ్రీన్ అంబా సిడర్లు 18 మంది గ్రీన్ కార్డులను గతంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నియమించడం జరిగింది. వారికి నేడు జీతాలు లేక వస్తులతో ఆలమటిస్తున్నారన్నారు.. వారి పరిస్థితి రెండింటికీ చెందని రేవడిగా మారింది. అటు ప్రభుత్వం జీతాలు ఇవ్వక పోగా ఇటు గ్రామ పంచాయతీలు ఇచ్చుకోలేక వారిని ఇబ్బంది పట్టే పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంచాయతీలకు ప్రభుత్వాలు నిధులు ఇవ్వక పోగా అభివృద్ధి కుంటుపడిన విషయం అందరికీ తెలిసిందే, దీనితోపాటు పారిశుద్ధ్య నిర్మూలన కొరకు నియమించిన గ్రీన్ అంబాసిడర్లను కూడా గాలికి వదిలేయడం పట్ల పారిశుధ్యం కూడా అన్ని గ్రామాలలో కుంటీ పడినట్లేనని తెలిపారు. గత ఏడాది క్రితం పంచాయితీలకు అరకొర నిధులు ఇచ్చి వాటిని ఆరు నెలలు కు సంబంధించి గ్రీన్ అంబాసిదర్లకు, గ్రీన్ కార్డులకు, వేతనాలు రూపంలో పంచాయతీ నుంచి చెల్లించాలని ఆదేశాలు హుకుం జారీ చేయడంతో అరకొరగా వేసిన నిధులను కూడా వారికే చెల్లించవలసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇలా అయితే పంచా యతీల పరిస్థితి చాలా అధ్వానంగా చేరుకోవడం ఖాయమని పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను నాయకులు దృష్టికి తీసుకు నాయకులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారానికి మార్గం దొరకకుపోవడంతో వారు కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. కాబట్టి ప్రభుత్వాల తీరు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో గడ్డుకాలం ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

జి-20 ప్రతినిధులను అబ్బుర పరిచేలా నగరాన్ని సుందరీకరించండి

- సీడీఎంఏ ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రపంచ దేశాలుకు సైతం దిక్సూచిగా సూచిస్తున్న విశాఖ నగరాన్ని, జి-20 సదస్సుకు విచ్చేయుచున్న ప్రతినిధులను అబ్బుర పరిచేలా విశాఖ నగరాన్ని సుందరీకరించి, నగర అభివృద్ధికి జివిఎంసి చేపట్టిన ప్రాజెక్టులను విపులంగా వివరించాలని సిడిఎంఎ ప్రవీణ్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని జివిఎంసి కమిషనర్ ఛాంబర్లో కమిషనర్, ఇతర అధికారులతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ నగర అభివృద్ధి దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే చాలా ప్రాజెక్టులు జివిఎంసి అందుబాటులోనికి తీసుకొచ్చిందని అన్నారు. అందులో 24 %ు% 7 త్రాగు నీరు, విద్యుత్ ఆదా చేస్తూ సోలార్ లైటింగ్, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, వేస్ట్ మేనేజ్మెంట్, తదితర ప్రాజెక్టుల వివరాలను జి-20 సదస్సు ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. నగరానికి విచ్చేయుచున్న ప్రతినిధులకు రవాణా, వసతి సౌకర్యాలలో లోటు పాటులు లేకుండా అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. ఆర్కే బీచ్ నుండి ర్యాడిసన్ బ్లూ హెూటల్ వరకు ఏర్పాటు చేస్తున్న సీ "వ్యూ" పాయింటుల వద్ద ప్లాంటేషన్, సుందరీకరణ, పారిశుధ్యం, విద్యుత్ అలంకరణ, పార్కింగ్, వెండింగ్ జోన్ తదితర అన్ని సదుపాయాలతో ప్రణాళిక ప్రకారం కూడిన సూచిక ప్రదేశాలను సుందరీకరించాలని ప్రధాన ఇంజినీరును సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సదస్సు అనంతరం ప్రతినిధులు పలు ప్రదేశాలను సందర్శించినప్పుడు ఆయా రోడ్డులలో, ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా ప్రదేశాలలో నాణ్యమైన డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జి-20 సదస్సు సన్నాహక పనుల వివరాలను అధికారులు సిడిఎంఎ వారికి వివరించగా, ఈ నెల 22వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తిచేయాలని సిడిఎంఎ ప్రవీణ్ కుమార్ వారిని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, గ్రీన్ కార్పొరేషన్ ఎం.డి. రాజశేఖర్ రెడ్డి, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి సురేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎస్ రవి, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం

విశాలాంధ్ర - చింతపల్లి : చట్టాలు గిరిజన హక్కులపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. వైకాపా అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టబద్దుల వైకాపా అభ్యర్థి సీతం రాజు సుధాకర్ ను శాసనమండలికి పంపిస్తే ఉద్యోగులకే గాక, నిరుద్యోగ పట్టబద్రులకు కూడా మేలు జరిగే అవకాశం ఉందని భాగ్య లక్ష్మి అన్నారు. మండలంలోని సెంయిటెన్స్ , భారతీయ విద్యా కేంద్రం , ఆంధ్రప్రదేశ్ గురుకుల ఆశ్రమ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేంద్రీకృత ఆశ్రమ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాలల్లో పట్టభద్రుల ఓటర్లతో శుక్రవారం ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సునిశిత పరిశీలనా శక్తి ఉన్న సీతం రాజు సుధాకర్ ను గెలిపించుకుంటే ఉద్యోగులు, పట్టబద్రులకే గాక, గిరిజనులకు లబ్ధి చేకూరే విధంగా సభలో ఎమ్మెల్సీగా గళాన్ని వినిపించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రులంతా వైకాపా బల పరిచిన అభ్యర్థికి మొదట (1)ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఉపాధ్యాయులకు అను బంధంగా ఉన్న సంఘాల ప్రతి నిధులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులతో కూడా వైకాపా అభ్యర్థి సుధాకర్ కు ఓటు వేసే విధంగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ మేలు కలిగే విధంగా పరిపాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి వైకాపా అభ్యర్థులను గెలిపించి ఆయనకు కానుకగా పంపించాలని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్ల పాటు ప్రతి గడప లోనూ సంక్షేమ ఫలాలు అందించిందని, దానితో సమానంగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, పార్టీ మండల అధ్యక్షులు మోరి రవి, సర్పంచ్ పోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ఆయా పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పట్టబద్రులు పాల్గొన్నారు.

విద్యుత్తు వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్‌పై వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ : విద్యుత్తు వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్ మరియు సంప్రదాయేతర ఇందన వనరుల పాత్రపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇఇసిఇ) విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం తేది:10-03-2023న ఐఐటి గాంధీనగర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాఘవన్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. విద్యుత్తు వాహన రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ఆయన వివరించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయ శేఖర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగాల మద్య అంతర్ పరిశోధనలు అవసరమన్నారు. ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవిన్‌స్టైన్ మాట్లాడుతూ విద్యుత్తు వాహనాల వినియోగం పెరగనున్న కారణంగా విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకోవడానికి సంప్రదాయేతర ఇందన ఉత్పత్తి, విద్యుత్తు నిలవ సామర్థ్యం పెంపుదల అవసరమన్నారు. జాతీయ స్థాయిలో నిర్వ హించిన ఈ వర్క్‌షాప్‌నకు కోఆర్డి నేటర్‌లుగా ఎమ్.ఇబ్రహీమ్, కె.అరవింద కుమార్ వ్యవహరించారు. దేశంలోని పలు ప్రాంతాలనుంచి అధ్యాపకులు, పారిశ్రామిక నిపుణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా చిరంజీవిరావును గెలిపించాలని ప్రచారం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని బూరుగుపాలెం పంచాయతీలోని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావును గెలిపించాలంటూ మాకవరపాలెం మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి చిరంజీవి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటును చిరంజీవిరావుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు మెంబర్ భర్త యాదగిరి నాగరాజు, బూరుగుపాలెం మాజీ వైస్ సర్పంచ్ రుత్తల సత్యనారాయణమూర్తి, మాజీ వార్డ్ మెంబర్ వేచలపు సత్తిబాబు, చొక్కాకుల దేవుడుబాబు, వబ్బలరెడ్డి గణేష్, స్థానిక ఎస్సీ కాలనీ పెద్దలు మారుతార్జున, యు.చిన్న, మర్ర బాబ్జి, యాదగిరి ఈశ్వరరావు, రమణ, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

చిక్కాల రామారావును పలువురు సన్మానం

విశాలాంధ్ర - పాయకరావు పేట : వైసీపీ ఉత్తరాంధ్ర రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా నియ మితులైన మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావును పలువురు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో గోపాలపట్నం సర్పంచ్ పన్నీరు పాపారావు, చిక్కాల బాబు, సత్యనారాయణ, గేదెల చిన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి... అండగా మేముంటాం

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి.

విశాలాంధ్ర - చింతపల్లి : పితృవియోగంతో బాధపడుతున్న వైకాపా అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి పాంగి గుణ బాబు కుంటుంబాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఎంపిపి కోరాబు అనూష దేవి, చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత, పార్టీ మండల అ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వలి లతో కలిసి శుక్రవారం ఆయన స్వగ్రామమైన కొలపరిలో పరామర్శించారు. ఈ సందర్భంగా భర్తను కోల్పోయిన గుణబాబు తల్లిని ఓదార్చారు. గుణ బాబు భార్య కొమ్మంగి సర్పంచ్ పాంగి లక్ష్మి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుణ బబు తండ్రి తన పెద్ద కుమారుడి మరణం తో తల్లడిల్లి అనారోగ్యం పాలై కాలం చేయడం బాధాకరమన్నారు. ఆయన మరణం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. అయినప్పటికీ మనో నిబ్బరమే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం అని కుటుంబ సభ్యులంతా ధైర్యంగా ఉండాలని ఆమె సూచించారు.

పూర్ణవాడి చెరువులో వ్యర్థాలు... ప్రజలకు అనర్థాలు...

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పూర్ణవాడి చెరువు లో నిత్యం చెత్త , కోళ్ల ఫారం చెత్తాచెదారం వ్యర్థాలతో నిత్యం కలుషితం చేస్తున్నారు ఆనందపురం నుండి బోనికి వెళ్లే రహదారి చెరువుని అనుకోని ఉండడం వల్ల వాహనదారుల నిత్యం దుర్భలమైన వాసన పీల్చుతున్నారు, ఈ చెడు వాసన వల్ల శ్వాస కోశ సంబంధిత వ్యాధులు వ్యాపించి అవకాశం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు అలాగే చెరువును కూడా వ్యర్థాలతో పూర్తిగా కలుషితం చేస్తున్నారు అనేకసార్లు ఈ వ్యర్థాల గురించి పత్రికల్లో ప్రచురించిన కూడా ఎటువంటి పరిష్కారం కూడా చేయలేదు. ఇకనైనా సచివాలయం సిబ్బంది, పంచాయతీ అధికారులు మేల్కొని చెరువు దగ్గర ఒక బోర్డు ఏర్పాటు చేయవలసిందిగా ప్రజల విజ్ఞప్తి చేస్తున్నారు.

జి-20 సదస్సు ప్రతినిధులకు జివిఎంసి ప్రాజెక్టు లను వివరించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ నగరంలో జరుగబోతున్న జి-20 సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులకు విశాఖ నగరా భివృద్ధిని, చేపట్టిన ప్రాజెక్టులను, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను విపులంగా తెలియజేయాలని, జివిఎంసి కమి షనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జి-20 సదస్సు ప్రతినిధులు తిరిగే ప్రదేశాలను పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో కమిషనర్ మర్రిపాలెం ఉడా లే-అవుట్ లోగల ఒక వేదికను గుర్తించి, ఆ వేదికనందు రాబోవు ప్రతినిధులకు కూలంకుశంగా జివిఎంసి చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు వివరాలను, అభివృద్ధి పనులను, త్రాగునీటి సరఫరా వివరాలను అతిధులకు తెలియజేయమన్నారు. ఆ వేదిక పరిసర ప్రాంతాలలో పారిశుధ్య, విద్యుత్, సుందరీకరణ, మొక్కలు ట్రిమ్మింగ్, గ్రీన్ బెల్టు ఏరియాలో పూర్తిగా పరిశుభ్రత తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ కెవిఎస్ రవి, జోనల్ కమిషనర్ ఆర్ జి వి కృష్ణ, కార్య నిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు, ఎసిపి రమణ మూర్తి, ఎఎంఓహెచ్ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పీఠం ఎవరినో వరించేనో..!

విశాలాంధ్ర - చింతపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పీఠం ఎవరిని వరించేనో అని ఉద్యోగులు, నిరుద్యోగ పట్టబద్రలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోటీలో ఉన్న నలుగురు సీతం రాజు సుధాకర్ వైకాపా, పివిఎన్ మాధవ్ బిజెపి, వ్యాపాడ చిరంజీవి రావు తెదేపా, కోరెడ్ల రమాప్రభ పిడిఎఫ్ అభ్యర్థులుగా ప్రధాన పార్టీల నుంచి బరిలో ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. మన్యంలో అధికార వైకాపా, ప్రతిపక్ష తెదేపాలు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇదే క్రమంలో బిజెపి అభ్యర్థి మాధవ్, పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ ల తరపున ఆయా పార్టీలు చాప కింద నీరులా ప్రచారాన్ని సాగిస్తున్నాయి. మరో రెండు రోజులలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి.

వైద్య సిబ్బందిపై కొరడా ఝులిపించిన ఐటిడిఎ పిఒ

విశాలాంధ్ర - సీలేరు : వైద్యాధికారి, వైద్య సిబ్బందిపై ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ కొరడా ఝులిపించారు. జికెవీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వైద్యాధికారి కెవి.నాగభూషణం, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌విఎ.నారాయణరావు విధులకు హాజరు కాకపోవడంతో మార్చి నెల జీతాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. మూమెంట్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేయలేదని ఎంపిహెచ్‌ఎలు ఎం.ఈశ్వరమ్మ, వి.సుభాష్నమ్మలకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఆరోగ్య కేంద్రం వద్ద నిర్మిస్తున్న బర్త్ వెయిటింగ్ హాలు నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని డిఈని ఆదేశించారు. అక్కడే శిధిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని ఆదేశించారు. అనంతరం పెదవలసలో నిర్మించిన సిసి రోడ్డును, చింతపల్లిలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిఈ చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

చతిస్గడ్‌లో క్రషర్ ప్లాంట్ ను ధ్వంసం చేసిన మావోయిస్టులు.... బొలెరో పికప్ వాహనం దగ్ధం

విశాలాంధ్ర - చింతూరు : చతిస్గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి మావోయిస్టులు ఒక క్రషర్ ప్లాంట్ ను, ఒక బొలెరో వాహనాన్ని దగ్ధం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లాలోని ఆవపల్లి. బాస గూడా గ్రామాల మధ్యన గల మురదండ గ్రామంలో రోడ్డు అభివృద్ధి పనులకుగాను గత ఏడాది తెలంగాణకు చెందిన ఓ కాంట్రాక్టర్ క్రషర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ క్రషర్ ప్లాంటును నిర్వహించరాదని అనేకమార్లు మావోయిస్టులు అనేకసార్లు హెచ్చరికలు చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి క్రషర్ నిర్వహిస్తుండటంతో రెచ్చిపోయిన మావోయిస్టులు గురువారం రాత్రి క్రషర్ ప్లాంట్ ను, ఒక బులెరా వాహనాన్ని, మిక్సర్ యంత్రాన్ని గోడ్డళ్ళ ధ్వంసం చేసి డీజిల్ పోసి దగ్ధం చేశారు. ఈ ఘటన అనంతరం ఆవు పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది మొరబండ గ్రామానికి చేరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు. ఇదే ప్లాంటును గత ఏడాది కూడా, దగ్ధం చేసి, ధ్వంసం చేసినట్లు తెలిసింది.

రెండేళ్లగా అందని బిల్లులు...

విశాలాంధ్ర - దేవీపట్నం : రాష్ట్రంలో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆడంబరంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు కు పెయింటింగ్ లు వేసిన కార్మికులు కు రెండేళ్ళు గడిచినా బిల్లులు చెల్లించక పోవటంతో ఆనాడు ఆ భవనాలకు రంగులు వేసిన కార్మికులు లబోదిబోమంటున్నారు. 2020లో ఈ కేంద్రాలకు కొన్ని ప్రైవేటు కొన్ని ప్రభుత్వ భవనాలను ఎంపిక చేసి వ్యవసాయ శాఖ, పంచాయితీ రాజ్ శాఖల ద్వారా భవనాలకు రంగులు వేయించారు. దేవీపట్నం మండలంలో ఇందుకూరుపేట, పోతవరం ఇందుకూరు, దామన్న పల్లి గ్రామాల్లో ఆర్‌బికెలు ఏర్పాటు చేసి ఒక్కో భవనంకు రూ.31 వేలు చొప్పున పెయింటింగ్ పనులను ప్రైవేటు పెయింటింగ్ కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. ఇది జరిగి దాదాపు రెండేళ్లు పైబడి అవుతున్న ఇంతవరకు పైసా కూడా ఇవ్వలేదు. కాగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఇదే పనుల్లో బిల్లులు అందక పలువురు కోర్టుకు కూడా వెళ్ళారని తమకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేస్తుందని దేవీపట్నం మండలంలో పెయింటింగ్‌లు వేసిన కార్మికుడు కొల్లి పావయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి అందని బిల్లులు కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుతెన్నులు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతున్నారు.

సీతంరాజు గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి పునాది

వైసీపీ నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి పునాది అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి, నాయుడుతోట హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు యతిరాజుల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సీతంరాజుకు మద్దతుగా జీవిఎంసి 94, 95 వార్డుల్లో శుక్రవారం ఆయన ముమ్మర ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి తొలి ప్రాధాన్యత ఓటును సీతంరాజుకు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జవహర్లాల్ నెహ్రూ ఐటిఐ కేంద్రంలో అధ్యాపకులు విద్యార్థులను కలిసి వైసిపి అభ్యర్థిని బలపరచాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభి వృద్ధికి ఇప్పుడిప్పుడే పునాదులు పడుతున్నాయని వాటిని పదిలిపరుచు కునేందుకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృత నిశ్చయంతో పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఈశ్వరరావు, జగదీష్ పాల్గొన్నారు.

నాగేంద్ర హత్య కేసును సీబీసీఐడికి అప్పగించాలి

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుగుల మోషే

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్ : మండలంలోని పీఎల్‌పురం గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్ర హత్య కేసును సీబీసీఐడికి అప్పగించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుగుల మోషే డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో బాధిత కుంటుంబానికి రూ.5 వేలు నగదు, 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరుగుల మోషే మాట్లాడుతూ దళితులను హత్య చేస్తుంటే ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దళితులపై మారణకాండ జరుగు తుంటే ప్రభుత్వ మొద్దు నిద్ర పోతుందా అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు అడ్డు పడడంతో కేసులో అసలైన హంతకులను పోలీసులు తప్పించారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి, కేసులో అసలైన హంతకులను అరెస్టు చేసే వరకు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. దళితులంతా ఐక్యంగా ఉండి నాగేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నాగేంద్ర కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 3 ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ కాకినాడ జిల్లా కార్యదర్శి పలివెల గోవిందు, జిల్లా నాయకులు తుమ్మలపల్లి కుమార్, గంపల చినరాజు, గాదంశెట్టి సురేష్, డిపిఐఎస్ తుని మండల ఇన్‌ఛార్జి మోర్త అబ్బులు, మందపల్లి చిన్న, మందపల్లి లోవరాజు, బదుగు దుర్గారావు, బదుగు సింహాచలం, మాసా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భీమా అవసరాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : జీవిత బీమా కు సంబంధించి ప్రజల్లో ఇంకా మరింత అవగాహన పెరగాల్సి ఉందని హెచ్డీఎఫ్ సీ లైఫ్ విభాగాల హెడ్ అనీష్ ఖన్నా అన్నారు. హెచ్డీఎఫ్సీ లైఫ్ యొక్క గ్యారంటీడ్ ఇన్ కమ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రోడక్టు భరోసాతో కూడిన, సాధారణ, పన్ను రహిత ప్రయోజనాలను అలాగే మరణం సంభవించినప్పుడు ఖచ్చితమైన ప్రయోజనాన్ని అందిస్తుందన్నారు. హెచ్డీఎఫ్సీ లైఫ్, వ్యక్తుల జీవిత కాలంలో వివిధ అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రోడక్టులను అందిస్తూ వస్తోందని, హెచ్డీఎఫ్సీ లైఫ్ గ్యారంటీడ్ ఇన్కమ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ద్వారా, కంపెనీ తమ కస్టమర్లు సాధారణమైన అలాగే భరోసాతో కూడిన ఆదాయం ద్వారా తమకు తోడ్పాటుగా నిలిచే ఆర్థిక నిధిని రూపొందించుకోవడంలో ఒక అవకాశాన్ని అందిస్తోందని చెప్పారు.

530 కొత్త విద్యుత్ స్థంబాలు ఏర్పాటుకు చర్యలు

విశాలాంధ్ర - జీకేవీధి : ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ శుక్రవారం జీకేవీధి మండలం వంచుల గ్రామంలో పర్యటించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చేపడుతున్న పనులను పరిశీలించారు. చింతపల్లి, జీకేవీధి మండలాలలో శిధిలావస్థకు చేరిన 530 విద్యుత్ స్తంభాలు మార్పు చేయడం జరిగిందని సూపరింటెండెంట్ ఇంజనీర్‌కి తెలియజేసారు. జరుగుతున్న పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

సర్వసభ్య సమావేశానికి పాలకవర్గం డుమ్మా?

విశాలాంధ్ర - దేవీపట్నం : మూడు నెలలకోసారి సమావేశమై ప్రజా సమస్యలపై చర్చించాల్సిన మండల పరిషత్ పాలకవర్గం సభ్యులకు పట్టీ పట్టనట్టు సర్వసభ్య సమా వేశానికి డుమ్మా కొట్టడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం దేవీపట్నం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మండల అధ్యక్షులు కుంజం మురళీ అధ్యక్షతన ఇందుకూరుపేట రైతు భరోసా కేంద్రం కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కలెక్టర్ అనుమ తులుతో ఈ సమావేశం ను నిర్వహిస్తున్నట్టు ఓ ప్రశ్నకు బదులుగా ఎంపిడీఓ రత్న కుమారి సమాధాన మిచ్చారు. సమావేశానికి హార్టికల్చర్ విభాగం నుంచి తప్ప మిగిలిన శాఖల అధికారులు హాజరయ్యారు. ఎనిమిది మంది ఎంపిటీసీలకు గాను నలుగురు ఎంపిటీసీలు, జెడ్పీటీసీ ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. దీంతో అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేసి ఉన్నతాధికారులు కు పంపే అవకాశాలకు తావులేకుండా పోయింది. తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలు వచ్చిన సమ స్యలపై పరిష్కారాలు పై చర్చించిన అనంతరం ఆయా శాఖలకు చెందిన ఒక్కో అధికారి తమ శాఖల పురోగతిని సభలో వివరించారు. ఇటీవల మండలంలోని ముసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల లో జరిగిన ఇద్దరు విద్యార్థినీల మృతి అనంతరం విద్యా ర్థినీలు హాస్టల్‌కు రాకపోవడంపై ఏటి డబ్యూఓ రామతులసి ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చారు. ప్రశ్నోత్తరాల కు తావు లేకుండా సర్పంచ్ లు ఎంపిటీసీలు సభకు డుమ్మా కొట్టడంతో సాదాసీదాగా సమావేశం మమ అనిపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర - మాకవరపాలెం : మండలంలోని రాచపల్లిలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు అందించిన వివరాల మేరకు రాచపల్లి గ్రామానికి చెందిన రుత్తల జోగుతల్లి(65) స్థానిక కామేశ్వరి గుడి వదద్ద ఒక వివాహ వేడుకకు హాజరయ్యేందుకు నడుచు కుంటూ వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో నేలపై తుళ్లిపడటంతో తలకు బలమైన గాయం తగిలింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తులు బైక్ ఆపకుండా వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రధమ చికిత్స అనంతరం విశాఖపట్నం తీసుకువెళ్లటానికి అంబులెన్స్‌లో బయలుదేరారు. అనకాపల్లి సమీపంలోకి వెళ్లే సరికి మృతి చెందింది.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మాకవరపాలెం ఎంపిడిఓ బి.అరుణశ్రీ కోరారు. మార్చి 14న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాకవరపాలెం ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ బి.అరుణ అధ్యక్షతన నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పోటా పోటీ ప్రచారానికి ఇక...శెలవు

విశాలాంధ్ర - మధురవాడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ప్రచారానికి నేటి (శనివారం)నుండి తెరపడ నుంది. ఈ ఎన్నికల బరిలో పోటి దారులు 34 మందివున్నా ప్రధానంగా చతుర్ముఖ పోరు గానే పోటా పోటీ ప్రచారం జరుగింది.ప్రధాన పోటీ దారులయిన పి.వి.యన్ మాధవ్ (భారతీయ జనతా పార్టీ), సీతంరాజు సుధాకర్ (వైయస్సార్సీపి),కోరెడ్ల రమాప్రభ (పి.డి.ఎఫ్), వేపాడ చిరంజీవిరావు (తెలుగుదేశం)ల మధ్యనే పోటీ ఉందని పట్టభద్ర ఓటర్లు అభిప్రాయ పడుతున్నారు. మరో ప్రక్కన జాతీయ కాంగ్రెస్ బలపరిచిన కొణతాల శ్రీనివాస్ కూడా ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. భీమిలి శాసన సభ మధురవాడ జోన్ పరిధిలో 5,6,7,8 మొత్తం నాలుగు వార్డులు వున్నాయి.వీటిలో 5,7వార్డులు టిడిపి కార్పొరేట ర్లు కాగా,6,8 వార్డులు వైకాపా కార్పొరేటర్లు వున్నారు.ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రతీ గ్రాడ్యుయేట్లు ఇంటికి వెళ్ళి ఓటర్లతో నేరుగా తమ తమ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థి స్తున్నారు.ప్రచారంలో ఎవరికి వారు ప్రత్యర్థుల పై విమర్శలను గుప్పిస్తున్నారు.ప్రధానంగా వైసీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పై తెలుగుదేశం,భాజాపా లు విరుచుకుపడుతున్నాయి.గడిచిన మూడున్నర సంవత్సరాల పరిపాలన లో రాష్ట్ర ప్రభుత్వం పట్టభద్రుల కోసం చేసిందే ఏమీ లేదని అధికారంలోకి రాక ముందు మెగా డియస్సీ ప్రతీ ఏడాది ప్రకటిస్తామని,జాబ్ క్యాలెండర్ ను విడుదల చేశ్తామని నమ్మబలికి తీరా వైసీపీ గెలిచాక ఏమాత్రం ఆ వాగ్దానాల పై దృష్టి పెట్టలేదని ప్రధాన ప్రతి పక్ష పార్టీ తెలుగుదేశం ఏకధాటిగా విమర్శిస్తూ తమ పార్టీ తరపున పోటీ చేస్తున్న వేపాడ చిరంజీవి రావు విద్యా వేత్త గా పేరు గడించారని తమ అభ్యర్థిని గెలిపించాలని ,మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం చేయటం తోపాటు స్థానిక యంమ్మెల్యే ముత్తంశెట్టి విలేఖరి పై దుర్భాల్లాడిన విషయాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో పనిచేస్తూ స్వతంత్ర పదవీ విరమణ చేసిన వేపాడ చిరంజీవి రావు తెలుగు దేశం పార్టీ పై నమ్మకం తో అభ్యర్థి గా బరిలో దిగారని తెదేపా నాయకులకు చెప్పుకొస్తున్నారు. వైసీపీ నాయకులు కూడా గట్టిగానే విమర్శలు గుప్పిస్తున్నారు.ఒక విద్యా వ్యవస్థ లో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ కోచింగ్ సెంటర్ లు తెరచి అమాయక నిరుద్యోగ యువత నుంచి లక్షల్లో వసూలు చేసి విద్యా వ్యాపారం గట్టిగానే చేశారని విమర్శలు గుప్పిస్తున్నారు వైకాపా నాయకులు.మరో ప్రక్కన భాజాపా అభ్యర్థి పి వి యన్ మాధవ్ కేంద్ర ప్రభుత్వం విశాఖ కు అందిస్తున్న అభివృద్ధి ని చాటుకుంటూ తాను గతంలో ఎమ్.ఎల్.సీ గా పనిచేసిన తీరును వివరిస్తూ నాయకులతో ప్రచారం చేపడుతున్నారు.బీజేపికి మద్దతుగా జనసేన ప్రచారం చేస్తుంది.జేడి లక్ష్మినారాయణ స్వతంత్ర అభ్యర్థి యం.హేమంత్ కుమార్ కు మద్దతు తెలీటం కూడా ప్రస్తావనకు వస్తుంది. వామ పక్షాలు, వివిధ ప్రజా సంఘాలు మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థి గా బరిలో దిగిన కోరెడ్ల రమాప్రభ ఆమె అనుచరులు ప్రశాంత వాతావరణంలో ప్రచారం చేపడుతూ అటు కేంద్ర,ఇటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విపరీత వినాశక చర్యలకు చరమ గీతం పాడాలని పిలుపు నిస్తూ తెదేపా, వైసీపీ, భాజాపా లు నిరుద్యోగ యువతకు చేసినమేలేమీ లేదని ,చట్ట సభలలో పోరాడి సాధించుకోవాలంటే నిరంతరం ప్రజలలో ఉంటూ,ప్రజా సంఘాలు ను ఏర్పాటు చేసి వారి బాగోగులు ను చూస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ను గెలిపించాలని విస్తృత ప్రచారం చేపడుతున్నారు ఆమె మద్దతు దారులు.వీరితో మరికొంత మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచారం చేపడుతున్నారు.ఏది ఎలా ఉన్నా అందరి మదిలో చతుర్ముఖీయ పోరే కనిపిస్తోందని .ఇక పట్టభద్రులుఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.